సాక్షి
మహబూబాబాద్
శనివారం । 25 । మే । 2024



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు
కాజీపేట జంక్షన్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్ తెలిపారు. - 8లో ▸



కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్
కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని మంత్రి సీతక్క అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.8^0 / 23.9^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బైక్‌పై ఎస్పీ చక్కర్లు



మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం సివిల్ డ్రెస్‌లో హెల్మెట్ ధరించి బైక్‌పై చక్కర్లు కొట్టారు. పలు వీధులల్లో తిరుగుతూ పరిస్థితులను పరిశీలించారు. ఇటీవలి కాలంలో ఎన్నికల బందోబస్తు, జిల్లా కేంద్రంలో చోరీలు పెరగడం, ఇతర సమస్యలపై ఎస్పీ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పరిశీలన చేయడం చర్చనీయాంశంగా మారింది.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ, ఈబీసీల్లో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం రీజియన్ కోఆర్డినేటర్ కె.ప్రత్యూష శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు గడువు అని పేర్కొన్నారు.

27నుంచి మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు బంద్

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ కోరిక మేరకు ఈనెల 27నుంచి మిర్చి కొనుగోళ్లను తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్‌కు నాణ్యతా ప్రమాణాలు లేని మిర్చి అమ్మకానికి వస్తుందని, ఈ మిర్చి తీసుకునే వ్యాపారులు లేనందున కొనుగోళ్లను బంద్ చేస్తున్నట్లు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ నరేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శుక్రవారం సందర్శించారు. అవసరమైన విద్యుత్, లోడ్, జనరేటర్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా కొనసాగించాలన్నారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ పి. విజయ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్ వైదేహి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ..



మహబూబాబాద్ అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయని డీఐఈఓ సమ్మెట సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలో జనరల్ గ్రూపుల్లో 703మంది విద్యార్థులకు 658 మంది హాజరై, 45 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్ గ్రూపులో 195 మంది విద్యార్థులకు 157మంది హాజరై, 38 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షల్లో జనరల్ గ్రూపుల్లో 180 మంది విద్యార్థులకు 172మంది హాజరై, 8మంది గైర్హాజరయ్యారన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిశీలన

హన్మకొండ: వరంగల్ కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎన్పీడీసీఎల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎన్పీడీసీఎల్ సీజీఎం కె.కిషన్, వరంగల్ ఎస్‌ఈ పి.మధుసూదన్ రావు, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, ఏడీ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ దీపక్‌తో విద్యుత్ సరఫరాపై చర్చించారు. సమస్యలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

మీ ఓటు మాకే..

జిల్లాలో జోరుగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం
- దూసుకెళ్తున్న ప్రధాన పార్టీలు
- ముఖ్య నాయకుల పర్యటనలు, సన్నాహక సమావేశాలు
- సోషల్ మీడియా ద్వారా ఓటర్ల ప్రసన్నం



సాక్షి, మహబూబాబాద్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. మీ ఓటు మా పార్టీకే వేయాలి అంటే.. మాకే వేయాలని అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ప్రచారానికి ఒక్క రోజు మాత్రమే సమయం ఉండటంతో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థుల తోపాటు మంత్రులు, మాజీ మంత్రులు, రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

ప్రధాన నాయకుల ప్రచారం..
అన్ని పార్టీల నాయకులు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న రెండుసార్లు జిల్లాలో పర్యటించారు. ఆయన గెలుపును చాలెంజ్‌గా తీసుకొని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో ప్రచారం చేశారు. అదేవిధంగా ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, పాలకుర్తి ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో మార్నింగ్ వాక్, ఇతర సందర్భాల్లో ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థిస్తున్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, కల్వకుంట్ల తారక రామారావు, సత్యవతితో రాథోడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు కూడా జిల్లాలో పర్యటించి సన్నాహక సమావేశాలు పెట్టి ఓటు వేయాలని కోరుతున్నారు. వీరితోపాటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం జిల్లా నాయకులతో పాటు మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీజేపీ ఎమ్మెల్యేలు జిల్లాలో పర్యటించి ఓటు వేయాలని కోరుతున్నారు.

విమర్శల పర్వం..
తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతూనే.. ఇతర పార్టీల అభ్యర్థులకు ఎందుకు ఓటు వేయకూడదో వివరిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. రాకేశ్ రెడ్డి ఇతర దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాడని, గెలిస్తే న్యాయం చేస్తాడని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చచేస్తున్నారు. ఇతరులకు కనీస పరిజ్ఞానం లేదని విమర్శలు చేస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను నిలదీయడం, నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన మండలిలో వాణి వినిపించాలంటే ప్రతిపక్ష నాయకుడినే ఎన్నుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా తీర్మార్ మల్లన్నను గెలిపిస్తే అధికార బలాన్ని ఉపయోగించి నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపుతారని చెబుతున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు ఒకటేనని బీజేపీకి ఓటు వేస్తే మెరుగైన సేవలు అందిస్తామని చెబుతున్నారు.

సోషల్ మీడియా ద్వారా ప్రచారం
నాయకుల ప్రచారమే కాకుండా సోషల్ మీడియా ద్వారా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఓటర్లను ఆకర్షించుకునేలా పోస్టులు పెడుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. వారి చరిత్ర, పనిచేస్తున్న సంస్థలు, ఉద్యమాలు, మొదలైనవి వీడియోలు చేసి ఓటు వేయాలని కోరుతున్నారు. మరికొందరు ఇతర అభ్యర్థుల పరిస్థితి ఏంటి.. వారి లోపాలను ఎత్తు చూపుతూ.. తమకు ఓటు వేయాలని వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇక రెండు రోజులుగా అభ్యర్థులు, వారి తరపున మాజీ మంత్రులు, ఇతర ప్రముఖులు గ్రూప్ కాల్స్ చేస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు.

మండలాల వారీగా పట్టభద్రుల ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
చిన్నగూడూరు	368	173	541
దంతాలపల్లి	908	444	1352
మరిపెడ	2615	1164	3779
నర్సింహులపేట	824	353	1177
నెల్లికుదురు	1396	618	2014
తొర్రూరు	3694	2081	5775
గూడూరు	1329	609	1938
కేసముద్రం	1557	797	2354
మహబూబాబాద్	3345	2149	5494
డోర్నకల్	1281	746	2027
కురవి	1260	580	1840
బయ్యారం	1105	620	1725
గార్ల	1301	645	1946
కొత్తగూడ	651	410	1061
గంగారం	253	160	413
ఇనుగుర్తి	474	206	680
సీరోలు	587	230	817
మొత్తం	22,948	11,985	34,933

పోరాడే వ్యక్తినే మండలికి పంపాలి

- మాజీ మంత్రి ఈటల రాజేందర్




సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

తొర్రూరు: ప్రజల పక్షాన పోరాడే వ్యక్తినే శాసన మండలికి పంపించాలని, ఆ అర్హత ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి ఉందని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోరుతూ శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో పాలకుర్తి నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఈటల మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రజలతో ఛీ కొట్టించుకున్న ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. పదేళ్లకాలంలో మోదీ ప్రభుత్వం ఒక్క స్కాం చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో అన్ని స్కాంలేనని.. మంత్రులు కూడా జైలుకు పోయారన్నారు. అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నిరుద్యోగులను, ఉగ్యోగులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మండలి ఎన్నికలో బుద్ధి చెప్పాలన్నారు. నిరుద్యోగులు, పట్టభద్రుల ఆకాంక్షలు నెరవేరాలంటే బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. బీజేపీ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పల్లె కుమార్, రంగు రాములు, కొలుపుల శంకర్, దొంగరి మహేందర్, కోటేశ్వర్, రచ్చ కుమార్, సాయిని ఝాన్సీ, సోమన్న, సురేష్, రవిబాబు, పులేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలులో విఫలం
మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈటల హాజరై మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి మోదీ ప్రధాని కావడం కాయమన్నారు. పాలన కంటే పదవులను కాపాడుకునే పనిలో కాంగ్రెస్ మంత్రులు నిమగ్నమయ్యారన్నారు. ఒకరి శాఖలో మరొకరు తలదూర్చుకుంటూ కయ్యం పెట్టుకుంటున్నారన్నారు. కేసీఆర్ రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను అమ్మి సంపాదించుకున్నారని, మిగిలిన కొద్దిపాటి భూములను కాంగ్రెస్ అమ్ముకునేందుకు యత్నిస్తున్నదన్నారు. రెండు పార్టీల తీరుతో విసుగు చెందిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. మాజీ రాజ్య సభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, ప్రదీప్‌రావు, బీరప్ప,వెంకన్న, జగన్, నరేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లరావు, ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ ఉన్నారు.

విత్తనాల ఎంపిక కీలకం



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు మేలు రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో విత్తన మేళాను ఏర్పాటు చేశామని, నేలల రకాలను బట్టి పంటల సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా చీడపీడల బెడద, పెట్టుబడి తగ్గించుకోవచ్చన్నారు. రైతులు కల్తీ విత్తనాలు విక్రయించే దళారులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని కోరారు. ఫౌండేషన్ వరి విత్తనాలు సిద్ది (డబ్ల్యూజీఎల్ 44), డబ్ల్యూజీఎల్ 962, కేఎన్‌ఎం 118 రకాలు, కంది డబ్ల్యూఆర్జీఈ 97 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివిధ రకాల చీడపురుగులు పంటలకు నష్టం కలిగించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విత్తనాలు విత్తుకునే ముందు పంట అవశేషాలను దగ్ధం చేయకుండా తొలకరి వర్షాలు పడగానే లోతు దుక్కులు దున్నుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సాగు చేయదగిన పంటల విత్తనాల ఎంపిక, సమగ్ర యాజమాన్య విధానాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. అలాగే మాలతి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు చర్చాగోష్టిలో రైతులు పంటల ఎంపికపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కిషోర్, రాంబాబు, క్రాంతికుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి తిరుపతి రెడ్డి, ఏఈఓ సరిత పాల్గొన్నారు.

రైతన్న జాగ్రత్త..

- విత్తనాల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- బీజీ3 సీడ్స్ అమ్మితే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో సదస్సులు



మానుకోట రైతు వేదికలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీనారాయణ

మహబూబాబాద్ రూరల్ : వానాకాలం పంటల సాగులో భాగంగా రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో శుక్రవారం విత్తనాల కొనుగోళ్లపై రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ప్రత్యేకంగా విత్తనాల కొనుగోళ్ల సందర్భంగా డీలర్లు ప్రతి రైతుకు అమ్మే విత్తనాల లాట్ నంబరు, సాగుచేసే పంట, వారు తీసుకునే వెరైటీ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని విత్తన డీలర్లను వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. ఎవరైనా సరే అనధికారికంగా బీజీ3 లాంటి విత్తనాలను అమ్మితే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లోకి వెళ్లి ఎవరుకూడా విత్తనాల అమ్మకాలు చేయవద్దని, అలా ఎవరైనా వస్తే వ్యవసాయ అధికారులకు చెప్పాలని రైతులకు సూచించారు.

విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- లైసెన్స్ ఉన్న విత్తన డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి
- రైతులు కొనుగోలు చేసిన విత్తనాల రశీదు తీసుకోవాలి
- పంటకాలం పూర్తయ్యే వరకు రశీదు భద్రపరుచుకోవాలి
- రశీదు మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, ధర ఉండాలి
- విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలి


అవగాహన కలిగి ఉండాలి



రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్ తీసుకోవాలి. పంట పూర్తి అయ్యేవరకు కొనుగోలు చేసిన విత్తన పాకెట్ కవరు, బిల్ రైతులు తమవద్ద జాగ్రత్తగా ఉంచుకోవాలి. విడి విత్తనాలు అమ్మేందుకు వచ్చిన వారి వివరాలు వ్యవసాయ అధికారులకు చెప్పాలి. విత్తనాల కొనుగోళ్లు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు.

– అభిమన్యు, డీఏఓ

నీటి పారుదలశాఖ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఓంకార్ సింగ్



ఎస్‌ఈకి బొకే అందిస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

హసన్‌పర్తి: నీటి పారుదలశాఖ వరంగల్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఓంకార్‌సింగ్‌ను నియమించారు. ఈమేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా కొనసాగుతున్న మహబూబాబాద్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లును ఆ బాధ్యత నుంచి తప్పించడంతో రామగుండం నీటి పారుదల శాఖ డివిజన్–3లో ఈఈగా వ్యవహరిస్తున్న ఓంకార్‌సింగ్‌కు వరంగల్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయనను టీఎన్జీఓస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి, టీఎన్జీఓస్ హసన్‌పర్తి యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రశాంతం



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని 6 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగిందని, 1,609 మంది విద్యార్థులకు 1,429మంది హాజరైనట్లు చెప్పారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభ బండ్ల ప్రదర్శనలో కోడ్ ఉల్లంఘన



పార్టీ జెండాల ప్రభ బండి ముందు వస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: మండల కేంద్రంలో లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రభ బండిని ప్రదర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు వారసంత ప్రాంతంలో పార్టీ జెండాలతో తయారు చేసిన ప్రభ బండితో స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చేరుకున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రభ బండి ముందు నడుస్తూ తన బల ప్రదర్శన చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా, ఎమ్మెల్యే కూడా నిబంధనలకు విరుద్ధంగా బండి ముందు వస్తున్నారని, అధికార పార్టీకి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా బందోబస్తులో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌ను కోడ్ ఉల్లంఘనపై అడుగగా.. తమకేమీ తెలియదని, ఎలాంటి గొడవలు జరగకుండా చూడడమే తమ విధి అని, నిబంధనల ఉల్లంఘనపై ప్రశ్నించడం తమ డ్యూటీ కాదన్నారు. కోడ్ ఉల్లంఘించారని రాస్తారా.. లేక అధికార పార్టీకి వత్తాసు పలుకుతారా అని కొందరు నాయకులు విలేకరులను అడగడం గమనార్హం. కాగా ఆలయ కమిటీ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో పూజానంతరం ఎమ్మెల్యేను సన్మానించి, తీర్థప్రసాదాలు అందించారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష

కురవి: వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు బలపాల గ్రామంలోని పీహెచ్‌సీలను ఆయన సందర్శించి తనిఖీ చేపట్టారు. పీహెచ్‌సీల్లోని రికార్డులు, డెలివరీ గది, టీబీ రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ రిజిస్టర్లు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. బలపాలలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, డాక్టర్లు విరాజిత, స్రవంతి, భార్గవి, కుమారస్వామి, సత్యనారాయణ, గౌసుద్దీన్, శోభ, యేసుమణి, బాబురావు, నాగమణి, సృజన, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

డ్రై డే విధానం పాటించాలి

- డీఎంహెచ్‌ఓ కళావతిబాయి



గ్రామంలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

మహబూబాబాద్ రూరల్: ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల పీహెచ్‌సీతో పాటు గ్రామంలో ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది.. జీపీ సిబ్బందితో కలిసి ప్రజలకు డ్రై డే విధానంపై అవగాహన కల్పించాన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఆశకార్యకర్తలు జీపీ సిబ్బందితో కలిసి మురుగునీటి గుంతలను పూడ్చివేయాలని, నీరు ఎక్కువగా నిల్వ ఉన్న కుంటల్లో ఆయిల్‌బాల్స్, కిరోసిన్ పోయాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేయాలన్నారు. వానాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని, పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న గర్భస్రావాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మల్యాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుధీర్ కుమార్, జిల్లా ఉపమాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఎంపీహెచ్‌ఈఓ తోట శ్రీనివాస్, స్టాఫ్‌నర్సులు ఆరోగ్య, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి
నెహ్రూసెంటర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం గైనకాలజిస్టు, టీవీవీపీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచి జిల్లాను రాష్ట్రంలో ఉన్నతస్థానంలో నిలపాలన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆస్పత్రుల సమన్వయ అధికారి వెంకట్రాములు, డాక్టర్ వీరన్న, డాక్టర్ చింత రమేష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ అంబరీష, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, ప్రభుత్వ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ దీప్తి, డాక్టర్ కరుణాకర్,డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల సీసీఎస్‌ రుణాల పెంపు

కాజీపేట రూరల్‌: రైల్వే కో ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ (లిమిటెడ్‌) సీసీఎస్‌ (రైల్వే ఉద్యోగులు) సభ్యుల రుణాలు పెంచుతూ డైరెక్టర్ల మీటింగ్‌లో తీర్మానించినట్లు కాజీపేట రైల్వే సీసీఎస్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ డి.శ్రీనివాస్‌ యాదవ్‌, కాజీపేట రైల్వే సీసీఎస్‌ కో ఆప్షన్‌ డైరెక్టర్‌ దేవులపల్లి రాఘవేందర్‌ శుక్రవారం తెలిపారు. సికింద్రాబాద్‌ సీసీఎస్‌ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీసీఎస్‌ డైరెక్టర్ల బోర్డు మీటింగ్‌లో రుణాలను పెంచుతూ కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాజీపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్‌, రాఘవేందర్‌ ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. సీసీఎస్‌ సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న జనరల్‌ లోన్‌ రుణం రూ.3లక్షలను రూ.4లక్షల వరకు, స్పెషల్‌ లోన్‌ రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. పెంచిన రుణాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, రుణాల వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో ఘటన
- ఏడాదిక్రితం ప్రేమవివాహం చేసుకున్న జంట


నితిన్‌ మృతదేహం

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని ఒకటో డివిజన్‌ పలివేల్పుల ఆనంద్‌నగర్‌ కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివేల్పులకు చెందిన గోలి నితిన్‌(25) నర్సంపేటకు చెందిన ఓ యువతి ప్రేమించుకుని ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొంత కాలం సవ్యంగానే సాగినా.. అనంతరం గొడవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భర్తతో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన నితిన్‌ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

- కాజీపేట రైల్వే స్టేషన్‌ అభివృద్ధి పనులు తనిఖీ చేసిన డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్‌

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌లో ప్రారంభించిన అమృత్‌ భారత్‌ రైల్వే స్టేషన్‌ పథకం అభివృద్ధి పనులు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్నట్లు సికింద్రాబాద్‌ డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ (డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్‌ జైన్‌ పేర్కొన్నారు. కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన వరల్డ్‌క్లాస్‌ అమృత్‌ భారత్‌ రైల్వే స్టేషన్‌ స్కీం అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్‌ఎం తనిఖీ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే వెయింటింగ్‌ హాల్స్‌, టాయ్‌లెట్స్‌, విశ్రాంతి గదులు, ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జితోపాటు జంక్షన్‌ ఎదుట ఉన్న సర్క్యులేటింగ్‌ ఏరియాలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేసి పనుల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలపై అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్న కార్యాలయాలు, నూతన నిర్మాణాలను పరిశీలించి పలు చోట్ల మార్పులు, చేర్పులపై, వర్షం నీరు నిల్వకుండా ఉండేందుకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్‌ ఏడీఆర్‌ఎం గోపాల్‌, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.


జనగామ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్‌ జైన్‌


కాజీపేట జంక్షన్‌లో అధికారులకు సూచనలిస్తున్న డీఆర్‌ఎం

జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమృత్‌ భారత్‌ స్కీంలో భాగంగా జనగామ రైల్వేస్టేషన్‌ ఆధునికీకరణకు సుమారు రూ.107కోట్ల వరకు బడ్జెట్‌ కేటాయించగా, మొదటి విడుత రూ.27 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్‌ జైన్‌ జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పురోగతిని పరిశీలించారు. లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పార్కింగ్‌, గ్రీనరీ, తదితర వాటికి సంబంధించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కేసీఆర్‌ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్‌

- రాష్ట్ర మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు: కేసీఆర్‌ కుటుంబం కంటే పెద్ద బ్లాక్‌మెయిలర్‌ రాష్ట్రంలో ఎవరూలేరని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం ఇంచర్ల సమీపంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో సీతక్క మాట్లాడారు. తాను ఎక్కడ మోసం చేశానో తనపై ఆరోపణలు చేస్తున్న దుర్మార్గులు, దోపిడీదారులు నిరూపించాలని సవాల్‌ విసిరారు. ఆదివాసీ మహిళ మంత్రిగా ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి సన్నాలుకు బోనస్‌ ఇస్తున్నామని, ఇక ముందు దొడ్డురకానికి కూడా ఇస్తామని తెలిపారు. 'పక్కదేశంలో చదువుకున్న బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గొప్పోడా.. మన మధ్యలో ఉంటూ ప్రజలు, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న తీన్మార్‌ మల్లన్న గొప్పోడా..' అని సమావేశానికి వచ్చిన పట్టభద్రులను అడిగి సమాధానం రాబట్టారు. మల్లన్నను అర్ధరాత్రి అరెస్ట్‌ చేసి, కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రశ్నించడం మానుకోలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్న మాట్లాడుతూ.. ప్రతి విషయంలో ప్రశ్నించి అడ్డుతగులుతున్నాడని నన్ను అరెస్ట్‌ చేయించావు, మరి ఇప్పుడు నీ చెల్లి కవితమ్మ ఎందుకు అరెస్ట్‌ అయిందని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ను ఉద్దేశించి తీన్మార్‌ మల్లన్న అన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారో రాకేశ్‌రెడ్డికే తెలియదని, దుర్గమ్మ గుడిచుట్టూ మేకను తిప్పినట్లు అతన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్‌, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, నాయకులు కూచన రవళి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్‌, బానోత్‌ రవిచందర్‌, రాంరెడ్డి, రవి, వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో నూతన వంగడాలు


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఉమారెడ్డి, ఉషాదయాళ్‌

హన్మకొండ: రైతులకు అవసరమైన నూతన వంగడాలు అందుబాటులో ఉన్నాయని వరంగల్‌ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్‌ ఆర్‌.ఉమారెడ్డి అన్నారు. వరంగల్‌ పైడిపల్లిలోని వరంగల్‌ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తన మేళాలో ఉమారెడ్డి మాట్లాడారు. అధిక దిగుబడులు ఇచ్చే, చీడపురుగులను తట్టుకునే నూతన వరి, కంది, పెసర విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పంటల అవశేషాలు కాలపెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని, పచ్చిరొట్ట పంటలను వేసుకుని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు వి.వెంకన్న, జి.వీరన్న, ఎన్‌.సంధ్య కిశోర్‌ మాట్లాడారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. పత్తి పంటలో అధిక సాంద్రత కలిగిన పత్తి ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని పవర్‌ పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా వివరించారు. పంట మార్పిడి విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విస్తీర్ణం పెంచాలని సూచించారు. వరంగల్‌ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్‌ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు గుర్తింపు పొందిన డీలర్‌ వద్దనే తీసుకోవాలని, వాటికి సంబంధించిన రశీదు, ఇతర వివరాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. జీలుగ విత్తనాలు రైతులకు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు అందించి, రైతులకు అవసరమైన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ దిలీప్‌ కుమార్‌, వ్యవసాయ శాఖ హనుమకొండ ఏడీ దామోదర్‌ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలి

వరంగల్‌: రైతులు సాగుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ అనుమతిలేని, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్న వ్యాపారులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్‌ మోర్తాల చందర్‌రావు కోరారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు వరంగల్‌ కలెక్టర్‌ ప్రావీణ్య, వరంగల్‌ పోలీసు కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ఝాను కలసి వినతి పత్రాలను అందజేసి, మాట్లాడారు. గత సంవత్సరం విక్రయించగా మిగిలిన బ్రాండెడ్‌ కంపెనీల విత్తనాలను అదే కంపెనీల పేరుతో ఇప్పుడున్న లాట్‌ నంబర్‌ వేస్తూ ప్యాకింగ్‌ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ట్రూతఫుల్‌ లేబుళ్లను ప్యాకింగ్‌లపై అంటించి అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పైరు ఏపుగా పెరుగుతుందని, దిగుబడి బాగా వస్తుందనే నమ్మించి అనుమతి లేని బయో మందులను సైతం రైతులకు అంటగడుతున్నారని అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పోలీస్‌ శాఖలోని నిఘా వర్గాలు, వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల హోల్‌సేల్‌, రిటేల్‌ దుకాణాల్లో, సరుకులు నిల్వలు ఉండే గోదాముల్లో తనిఖీలు చేపట్టి రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌, సంపత్‌కుమార్‌, నర్సయ్య, గోపాలరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం

- కరీంనగర్‌ మాజీ మేయర్‌ సర్దార్‌ రవీందర్‌సింగ్‌


న్యూరాయపురలో ప్రచారంలో పాల్గొన్న రవీందర్‌సింగ్‌

హన్మకొండ చౌరస్తా: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రభుత్వాన్ని ప్రశంసించే వ్యక్తిని కాకుండా ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందామని కరీంనగర్‌ మాజీ మేయర్‌, సివిల్‌ సప్లయీస్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ సర్దార్‌ రవీందర్‌సింగ్‌ పట్టభద్రులను కోరారు. హనుమకొండలోని కాకతీయ కాలనీ, కార్పొరేషన్‌ సర్కిల్‌, న్యూ రాయపుర ప్రాంతాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గత బీఆర్‌ఎస్‌ సర్కార్‌ ఇచ్చిన సంక్షేమ పథకాలను పక్కన పెట్టిందని అన్నారు. తీన్మార్‌ మల్లన్న.. చోర్‌ మార్‌గా.. మారి ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుగా మారాడని అన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్‌, అనిల్‌, పాషా, చిరంజీవి, జనార్దన్‌గౌడ్‌, తుల రమేశ్‌, శీలం ప్రవీణ్‌, గోపిరెడ్డి రాజు, అనురాం తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌


సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్‌

రామన్నపేట: గత 40 సంవత్సరాలుగా నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేస్తూ, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేశాయ్‌పేట కేఆర్‌ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌, ఎన్నికల ఇన్‌చార్జ్‌ పీఎల్‌ శ్రీనివాస్‌, కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్‌ షా, బాకం హరిశంకర్‌, వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, అల్లం నాగరాజు, కార్పొరేటర్లు కల్పన, స్వాతి, రంజిత్‌ పాల్గొన్నారు.

ప్రదీప్‌రావు ఇంటికి లక్ష్మణ్‌

కాశిబుగ్గ: నగర పర్యటనకు వచ్చిన లక్ష్మణ్‌ ఓ సిటీలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, రేణుక దంపతులు ఆయనకు స్వాగతం పలికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు.

జిల్లాల్లో క్రికెట్‌ అసోసియేషన్లను సంప్రదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నయీంనగర్‌: తెలంగాణ జిల్లాలలో తెలంగాణ క్రికెట్‌ అసోసియేషన్‌ను సంప్రదించకుండా హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ అధికారులు ఏ చర్యలకు ఉపక్రమించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఝెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి, కోశాధికారి డాక్టర్‌ పి.విజయచందర్‌ రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్‌ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌ తప్ప ఏనాడు తెలంగాణ జిల్లాల్లో క్రికెట్‌ అభివృద్ధికి కృషి చేయని హెచ్‌సీఏ ఇప్పుడు జిల్లాల్లో స్టేడియాలను నిర్మాణం చేస్తామనడం బూటకమన్నారు. ఇన్ని సంవత్సరాలు జిల్లాల పేరు చెప్పి బీసీసీఐ నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకుని అవినీతికి పాల్పడిన హెచ్‌సీఏ పాలకమండలి బాధ్యత వహిస్తుందా.. అని ప్రశ్నించారు. హెచ్‌సీఏలో గత 5ఏండ్లుగా లెక్కలు, ఫోరెన్సిక్‌ ఆడిట్‌ చేయలేదని, రంజీ ట్రోఫీలలో 24వ స్థానానికి పడిపోయిందని తెలిపారు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన హెచ్‌సీఏ క్రికెట్‌ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. వరంగల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జైపాల్‌, సమీర్‌, నవరసం, ఆదిత్య, అలీమ్‌ తదితరులు పాల్గొన్నారు.

మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ముప్పు

- సామాజిక విశ్లేషకులు భిక్షమయ్య


సదస్సులో మాట్లాడుతున్న బొజ్జ భిక్షమయ్య

నయీంనగర్‌: మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు బొజ్జ భిక్షమయ్య అభిప్రాయపడ్డారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఇంటలెక్చువల్స్‌ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఫోరమ్‌ కన్వీనర్‌ ప్రొ.ఎర్రగట్టుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త బొజ్జ భిక్షమయ్య మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి అన్న నినాదమే మోసపూరితమైందన్నారు. బలహీనవర్గాలు, వెనుకబడిన మైనార్టీలకు రిజర్వేషన్లు ఉండకుండా కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభలు 90రోజులు నడవాలని కాని 15రోజులే నడుస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తీన్మార్‌ మల్లన్నను గెలిపించాలని కోరారు. వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. డాక్టర్‌ ప్రీతి దయాళ్‌ మాట్లాడుతూ.. రాజ్యాంగం రద్దు అయితే దేశంలో ప్రజాస్వామ్యం రద్దు అవుతుందన్నారు. ప్రొఫెసర్‌ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చాలనే వాళ్లను ఓడించాలని, ప్రజల గొంతుకగా నిలిచిన తీన్మార్‌ మల్లన్నను గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు రామబ్రహ్మం, ప్రొఫెసర్‌ వీరన్న, ఎండీ.రియాజ్‌, కత్తి వెంకటస్వామి, బదావత్‌ రాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్‌ చేసిన వ్యక్తికి కమ్యూనిస్టుల మద్దతా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ


విలేకరులతో మాట్లాడుతున్న రాణి రుద్రమ

హన్మకొండ: యూ ట్యూబ్‌ చానల్‌ను అడ్డు పెట్టుకుని బ్లాక్‌ మెయిల్‌ చేసిన వ్యక్తి తీన్మార్‌ మల్లన్న కమ్యూనిస్టులు ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీనియర్‌ నాయకుడు రాఘవులు అవినీతికి పాల్పడ్డారని, బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ వద్ద రూ.100 కోట్లు తీసుకుని 10 టీవీ చానల్‌ను ధారాదత్తం చేశారని తీన్మార్‌ మల్లన్న యూట్యూబ్‌ ద్వారా ప్రచారం చేశారని, ఈ ఆరోపణలకు ఆధారాలు చూపించాడా..? లేక తీన్మార్‌ మల్లన్న బ్లాక్‌ మెయిల్‌కు భయపడి మద్దతు ఇస్తున్నారా.. అనేది సమాజానికి చెప్పాలన్నారు. బ్లాక్‌ మెయిల్‌ చేసి మీ అవినీతి సొమ్ము నుంచి తీసుకున్న మొత్తాన్ని సీఎం రేవంత్‌కు ఇచ్చి టికెట్‌ తెచ్చుకున్నారా అని ప్రశ్నించారు. తాను కూడా కేటీఆర్‌ వద్ద డబ్బులు తీసుకుని స్థలం కొన్నానని ఆ చానల్‌ ద్వారా ప్రచారం, ఆరోపణ చేస్తే ఆధారాలు చూపించాలని, లేకపోతే చెప్పుతో కొడతానని హనుమకొండ చౌరస్తాలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది జరిగి మూడేళ్లయినా ఆధారాలు చూపించలేదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు తాళ్లపల్లి కుమారస్వామి, కొండి జితేందర్‌ రెడ్డి, విష్ణువర్ధన్‌ రెడ్డి, రాజిరెడ్డి, నర్మెట శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైంది.. అందుకే చనిపోతున్నా

- కుటుంబ సభ్యులకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య


బాదావత్‌ నవీన్‌ మృతదేహం

గూడూరు: 'నాప్రేమ విఫలమైంది. అందుకే చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు తన కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురం భీంనగర్‌ అటవీప్రాంతంలో శుక్రవారం జరిగింది. పోలీసులకు మృతుడి తండ్రి కీర్యానాయక్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట డివిజన్‌ ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన బాదావత్‌ నవీన్‌ (25) ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కానీ ఆ యువతి ఇటీవల నవీన్‌ ప్రేమను కాదంటుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో అతను గురువారం ఉదయం నాజీతండా నుంచి బయలుదేరి గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురంభీంనగర్‌ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. తన ప్రేమ విఫలమైందని, అందుకు తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియో కాల్‌ చేసి చెప్పాడు. ఆ తరువాత పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నాజీతండా నుంచి బయలుదేరి అడవికి చేరుకోగా నవీన్‌ అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే గూడూరు సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి కీర్యానాయక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారు


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గుగులోతు బోజ్య

సాక్షి, మహబూబాబాద్‌: పోలీస్‌ స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారని మానుకోట జిల్లాలోని కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన గుగులోతు బోజ్య ఆరోపించాడు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకర్లతో మాట్లాడాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు బస్తాల దొడ్డు బియ్యం విక్రయించడానికి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు తీసుకెళ్తుండగా కొత్తగూడ ఎస్సై గువ్వల బోడు వద్ద పట్టుకుని బండిని సీజ్‌ చేసి కొట్టాడు. వారం రోజుల తర్వాత పిలిచి మళ్లీ కొట్టాడు. పీడీఎస్‌ బియ్యం అమ్ముకుంటున్నట్లు కేసు పెట్టి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసి మరోసారి బియ్యం విక్రయానికి పాల్పడొద్దని చెప్పి స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చారు. ఈరోజు(శుక్రవారం) మళ్లీ మాట్లాడాలని స్టేషన్‌కు పిలిచాడు. భయంతో గ్రామపెద్దలను తీసుకుని వెళ్లాను. పెద్దమనుషులను బయట కూర్చోమని చెప్పి నన్ను ఎస్సై మళ్లీ కొట్టాడు. ఇలా మాటిమాటికి పిలిచి కొడుతున్నాడని బోజ్య తెలిపారు. ఇదే విషయమై ఎస్సై దిలీప్‌ని వివరణ కోరగా తాను ఎవరిని చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు. బియ్యం ఎక్కడికి తరలిస్తున్నారో తెలుసుకునేందుకు విచారిస్తుండగా తనపై కావాలని ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తేలుకాటుతో బాలుడి మృతి


కిషన్‌సింగ్‌ మృతదేహం

ఎల్కతుర్తి: ఆరబోసిన ధాన్యాంపై కప్పిన పరద తీస్తుండగా ఓ బాలుడికి తేలు కుట్టడంతో మృతిచెందాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాగూర్‌ కిషన్‌సింగ్‌(13) తన తండ్రి లాగూర్‌ శ్యామ్‌సింగ్‌తో కలిసి గ్రామ శివారులో ఆరబోసిన వరిధాన్యంపై కప్పిన పరదను తీస్తున్న క్రమంలో తేలు కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేపట్టాలి

- జాయింట్‌ ఐజీ మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డి, సుభాషిణిని సత్కరిస్తున్న రవి, అమ్జద్‌

కాజీపేట అర్బన్‌: భూక్రయవిక్రయదారులకు సులభతరంగా రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను పూర్తి చేయాలని రిజిస్ట్రేషన్‌ అండ్‌ స్టాంప్స్‌ శాఖ జాయింట్‌ ఐజీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వరంగల్‌ ఆర్వో రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా జాయింట్‌ ఐజీ మధుసూదన్‌ రెడ్డి రిజిస్ట్రేషన్‌, చిట్స్‌ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ కార్యాలయంలో జాయింట్‌ ఐజీ మధుసూదన్‌రెడ్డి, డీఐజీ సుభాషిణిని జిల్లా రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి, సబ్‌ రిజిస్ట్రార్‌ అమ్జద్‌ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.

విద్యుత్‌ షాక్‌తో డిగ్రీ విద్యార్థి దుర్మరణం


కరుణాకర్‌ (ఫైల్‌)

లింగాలఘణపురం: కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు కూలిపనులకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి విద్యుత్‌ షాక్‌తో మృతిచెందిన విషాదకర ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల ప్రమీల ఆగమల్లయ్య చిన్న కుమారుడు, డిగ్రీ విద్యార్థి గట్టగల్ల కరుణాకర్‌ (21)భవన నిర్మాణపనులకు కూలీగా వెళ్లాడు. ఈ నేపథ్యంలో మేస్త్రీ గట్టగల్ల నర్సయ్య పటేల్‌గూడెంలో బండ శ్రీశైలం ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా కరుణాకర్‌ రోజువారీ కూలీగా వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం యథావిధిగా పనికి వెళ్లి సిమెంట్‌, ఇసుక కలిపేందుకు సంప్‌లో నుంచి నీరు పెట్టేందుకు మోటార్‌ ఆన్‌ చేసి, తిరిగి బంద్‌ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.